# మోసపోయి రాలిపోయిన ముత్యాలమ్మ

మనిషిని మనిషి మోసం చేసే విష సంస్కృతికి బీజాలే పడకూడదు. అవి పడిన తరువాత వాటి పని అవి చేసుకుంటూపోతాయి. నగరాల నుండి వచ్చి గిరిజన మహిళను దగాచేసి వెళ్ళిపోయిన ఘరానా బాబుల వారసత్వం ప్రస్తుతం ఏజెన్సీ గ్రామాల్లో వుండే గిరిజనులు కూడా పుణికి పుచ్చుకుంటున్నారు.

అలాంటి నయవంచనకు గురైన ఐ.పోలవరం గ్రామం యువతి కంగల ముత్యాలమ్మ (18) తన నిండునూరేళ్ళ బ్రతుకును బలవంతంగా చిదిమేసుకుంది. అదే గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ కొడుకు ముత్యాలమ్మను ప్రేమించానని నమ్మించి మోసం చేశాడు. ఉద్యోగం రాగానే హాయిగా కాపురం పెడదామని తియ్యటి కబుర్లు చెప్పాడు.

అన్నీ అనుకున్నట్టుగానే ఉద్యోగం దొరికింది కాని ముత్యాలమ్మకు మాత్రం ప్రేమించిన ప్రియుడు దరి చేరలేదు. నీవెవరు అన్నట్టు చూశాడు. గ్రామంలో ఆ అవమానం భరించలేక ముత్యాలమ్మ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఇటీవలనే జరిగింది.

గిరిజన గ్రామాల్లో ఆత్మహత్యలు అనేవి తెలియవు. చరిత్రను పరిశీలిస్తే గిరిజన మహిళకు ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి ఎప్పుడూ కలగలేదు. రికార్డులు పరిశీలించినా ఆత్మహత్యల కేసుల నమోదు చాలా స్వల్పంగా వుంది.

నగరసంస్కృతి బీజాలు నాటుకున్న తరువాత పెరిగిన సామాజిక సమస్యలు ఎక్కువగా మహిళల చుట్టూనే అల్లుకున్నాయి. ఆత్మహత్యలు, శరీరం పణంగా పెట్టి జీవించడం గిరిజన సమాజానికి తెలియవు. ఇప్పుడిప్పుడే అవి అనుభవంలో వస్తున్నాయి.



ఆత్మహత్య చేసుకున్న ముత్యాలమ్మ